క్లుప్తంగా

శాండ్ ఫిల్టర్ బెడ్‌లు క్లీనింగ్

తాడేపల్లి రూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని ఆత్మకూరు గుంటూరు చానల్ ఒడ్డున ఉన్న శాండ్ ఫిల్టర్ బెడ్‌లను సోమవారం కార్పొరేషన్ సిబ్బంది శుభ్రం చేశారు. నాచు, మట్టి పేరుకుపోయి వాటర్ సరిగ్గా ఫిల్టర్ కాకపోవడంతో గమనించిన సిబ్బంది ఫిల్టర్ బెడ్‌లోని నీటిని తొలగించి, క్లీనింగ్ చేపట్టారు. మంగళగిరి ప్రజలకు సోమవారం సాయంత్రం తాగునీటిని పునరుద్ధరించారు.

మహంకాళి అమ్మవారి దేవస్థానంలో సంక్రాంతి ఉత్సవాలు



తాడేపల్లి రూరల్: దుగ్గిరాల మండలం, కంఠంరాజు కొండూరులోని శ్రీ మహంకాళి అమ్మవారి దేవస్థానంలో ఆదివారం నుంచి సోమవారం వరకు సంక్రాంతి సంబరాలు వైభవంగా నిర్వహించారు. ఆలయంలో సంప్రదాయక నృత్యాలు, హరిదాసుల గీతాలు, గంగిరెద్దుల నాట్యాలు ఏర్పాటు చేశారు. ఆలయ అర్చకులు పావులూరి తారకనాథ్ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఉత్సవాలను ఆలయ కార్యనిర్వహణాధికారి నంబూరు చినవెంకటరెడ్డి పర్యవేక్షించారు. కార్యక్రమంలో అర్చకులు రుద్రపాటి సుబ్రహ్మణ్యేశ్వర శర్మ, పావులూరి మణికృష్ణ పాల్గొన్నారు.

వైభవంగా గోదా రంగనాథస్వామి కల్యాణం



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని సీతారామ చంద్రస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన వేదికపై గోదాదేవి, రంగనాథస్వామి కల్యాణం ఆదివారం వైభవంగా నిర్వహించారు. అర్చకులు రాజేంద్రశర్మ స్వామివార్లకు విశేషపూజలు, మండపారాధన, కలశ పూజ, చూర్ణిక, పుణ్యాహవాచనం నిర్వహించి శాంతికల్యాణం నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

వృద్ధుడికి ఆర్థిక సాయం

తాడేపల్లి రూరల్: ఇన్‌ఫెక్షన్‌తో కాలు తొలగించిన వృద్ధుడికి పలువురు దాతలు తమ వంతు ఆర్థిక సహాయాన్ని సోమవారం అందజేశారు. మంగళగిరి పట్టణానికి వృద్ధుడు రమేష్‌కు ఇటీవల కాలంలో ఇన్‌ఫెక్షన్ కారణంగా కాలును తొలగించారు. విషయం తెలుసుకున్న మంగళగిరికి చెందిన ఖిద్మత్ సంస్థ అధ్యక్షులు షేక్ షఫీ రూ.5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. యర్రబాలేనికి చెందిన ఆళ్ల సురేష్ రూ.2 వేలు, చావలి మురళి, వెయ్యి రూపాయలు, డాక్టర్ రేమిణిశెట్టి గిరి ప్రసాద్, వెయ్యి రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఆర్థిక సహాయం అందించిన వారిలో గుండాల శ్రీనివాసరావు, దోనె పాములు, అత్తలూరి వీర వెంకయ్య ఉన్నారు. రమేష్‌కు అవసరమయ్యే మందులను అందజేస్తానని లేళ్ల సాయినందన్ హామీ ఇచ్చారు.

స్పీడ్ బ్రేకర్ తెచ్చిన తిప్పలు

ఇద్దరు యువకులకు గాయాలు



తాడేపల్లి రూరల్(దుగ్గిరాల): తెనాలి–మంగళగిరి రహదారిలో స్పీడ్ బ్రేకర్ వల్ల ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలు అయ్యాయి. సోమవారం దుగ్గిరాల గ్రామంలోని యాదవపాలెంకు చెందిన జగదీష్, గోపీ నందివెలుగు నుంచి దుగ్గిరాలకు వేర్వేరు ద్విచక్ర వాహనాలపై వస్తున్నారు. తెనాలి మంగళగిరి రహదారిలో ఈమని లాకుల వద్ద స్పీడ్ బ్రేకర్ ఉంది. స్పీడ్ బ్రేకర్ వద్ద గోపి బ్రేక్ వేయడంతో జగదీష్ వేగంగా వచ్చి గోపి ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్నాడు. ఈ ఘటనలో జగదీష్ ముందుకు పడి తీవ్ర గాయాల పాలయ్యాడు. గోపికి స్వల్ప గాయాలు అయ్యాయి. సమాచారం అందుకున్న దుగ్గిరాల 108 సిబ్బంది అక్కడకు చేరుకుని ఇ.ఎం.టి ఆనంద్, హరిబాబు ప్రథమ చికిత్స నిర్వహించి తెనాలి ఏరియా ఆసుపత్రికి జగదీష్‌ను తరలించారు.

పేకాట స్థావరాలపై దాడి

తాడేపల్లి రూరల్: మంగళగిరి పట్టణ రూరల్ పరిధిలోని పోలీసుల ఆధ్వర్యంలో ఆది, సోమవారాల్లో పలుచోట్ల పేకాట స్థావరాలపై పోలీసులు దాడి చేసి పలువురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. మంగళగిరి రూరల్ పరిధిలోని నూతక్కి, మెల్లెంపూడి మధ్య పంటపాలాల్లో పేకాట ఆడుతున్నారని సమాచారం అందుకున్న మంగళగిరి ఎస్‌ఐ విజయ్‌కుమార్ రెడ్డి దాడి చేశారు. ఈ దాడిలో ఐదుగురిని అదుపులోకి తీసుకుని వీరి వద్ద రూ.7,990 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

మంగళగిరిలో ఓ ఇంట్లో..

మంగళగిరి పట్టణ పరిధిలోని పాత మంగళగిరిలో ఓ ఇంట్లో గుట్టుచప్పుడు కాకుండా పేకాటాడుతున్న ఏడుగురిని, నిర్వాహకుడిని మంగళగిరి ఎస్‌ఐ మహేంద్ర అదుపులోకి తీసుకుని వీరి వద్ద నుంచి 33 వేల రూపాయలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. మంగళగిరి రూరల్ పరిధిలోని ఆత్మకూరు శివారులోని ముళ్ల పొదల్లో పేకాటాడుతున్న వారిపై మంగళగిరి ఎస్‌ఐ రమేష్‌బాబు దాడిచేసి పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని వీరి నుంచి రూ.3000 స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేశారు.

సందడిగా సంక్రాంతి ముగ్గుల పోటీలు



ముగ్గుల పోటీల్లో మొదటి బహుమతి గెలుపొందిన పద్మజ



ఎస్‌ఆర్‌ఎం వర్సిటీలో ముగ్గులు వేస్తున్న మహిళలు

తాడేపల్లి రూరల్: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కార్పొరేషన్ పరిధిలోని యర్రబాలెంలో సంఘం మిత్రా మహిళా మండలి ఆధ్వర్యంలో శ్రీరామ్ నగర్ భావనారుషి స్వామి గుడి వద్ద ఆదివారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ ముగ్గుల పోటీలలో ప్రథమ బహుమతి కె.పద్మజ గెలుపొందగా, ద్వితీయ బహుమతిని జ్యోతి అందుకున్నారు. మూడో బహుమతి ఆర్.చందన, నాలుగో బహుమతి లక్ష్మి, 5వ బహుమతిని ఉషాలు దక్కించుకున్నారు. అదే విధంగా మ్యూజిక్ చైర్, స్కిప్పింగ్, రన్నింగ్, స్లో సైక్లింగ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం మిత్రా మహిళా మండలి అధ్యక్షురాలు రావుల అమీతాచారి, ఉపాధ్యక్షురాలు చిలుకోటి సామ్రాజ్యం పాల్గొన్నారు.

ఎస్‌ఆర్‌ఎంలో సంక్రాంతి సంబరాలు

తాడేపల్లి రూరల్: మంగళగిరి కార్పొరేషన్ పరిధిలోని ఏపీ ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీలో సోమవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. తెలుగు సంస్కృతీ, సంప్రదాయాలకు అద్దం పట్టేలా క్రీడా పోటీలు నిర్వహించారు. రంగవల్లి, మంట లేని వంట, టగ్ ఆఫ్ వార్, ఉట్టి కొట్టే పోటీల్లో ఉద్యోగులు పాల్గొన్నారు. రంగవల్లి పోటీల్లో అలేఖ్య, సువర్ణ, దీప్తి ప్రథమ స్థానాన్ని దక్కించుకోగా, స్వాతి, శిరీష, అంజలి, దివ్య, స్వాతి లేఖలు ద్వితీయ స్థానాన్ని సొంతం చేసుకున్నారు. మంటలేని వంట పోటీల్లో షాలిని, ప్రియాంక, సుధ, ప్రత్యూష ప్రథమ స్థానంలో, అలేఖ్య, కీర్తి, సురేఖ, అన్వేష ద్వితీయ స్థానంలో నిలిచారు. కప్ స్టాకింగ్ పోటీల్లో వేదశ్రీ, స్వాతి లేఖ బహుమతులు దక్కించుకున్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య మనోజ్‌కుమార్ అరోరా, రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.ప్రేమ్‌కుమార్, డైరెక్టర్ అనూప్ సూర్యవంశీ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్ అసిస్టెంట్ డైరెక్టర్ శివరంగన్, డాక్టర్ అరుంధతి, డాక్టర్ శ్వేత, డాక్టర్ లక్ష్మీ రాజ్యం పాల్గొన్నారు.

ఫిరంగిపురంలో..

ఫిరంగిపురం: మండలంలోని పలు గ్రామాల్లో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. 113 తాళ్లూరు, రేపూడి, వేమవరంలోని బొడ్డురాయి సెంటర్లో ముగ్గుల పోటీలు నిర్వహించగా పోటీలు నిర్వహించారు. వేమవరం సర్పంచి మున్నంగి శివకుమారి ప్రారంభించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జీవీఆర్‌కే మూర్తి పాల్గొన్నారు. మేరికపూడిలోని సెంటర్లో ముగ్గుల పోటీలను సర్పంచి పూసపాటి మల్లేశ్వరి ప్రారంభించారు. పోటీల్లో గెలుపొందినవారికి సోమవారం బహుమతులు అందజేశారు.

సీతారామ కల్యాణ కమిటీ ఆధ్వర్యంలో..

తాడేపల్లి రూరల్: మంగళగిరి పట్టణ పరిధిలోని అవ్వారు వారి వీధిలో సీతారామ కల్యాణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి సంక్రాంతి సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ మునగాల మల్లేశ్వరరావు, మార్కెట్ యార్డు చైర్మన్ మునగాల భాగ్యలక్ష్మి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంగళగిరి సీతారామ కల్యాణ కమిటీ ఆధ్వర్యంలో సంప్రదాయ బద్ధంగా సంక్రాంతి వేడుకలు నిర్వహించి, మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించడం ఎంతో హర్షణీయమని చెప్పారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు గోలి మహేశ్వరరావు, గుణేశ్వరరావు మాస్టారు పాల్గొన్నారు.

చినకాకాని షైన్ ఆనంద శరణాలయంలో..

తాడేపల్లి రూరల్: మంగళగిరి రూరల్ పరిధిలోని చినకాకాని షైన్ ఆనంద శరణాయలంలోని బాలబాలికలకు సంక్రాంతి పండుగ సందర్భంగా మంగళగిరి బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పిండివంటలు, గాలిపటాలు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ బాలబాలికలు పిండివంటలు తింటూ గాలిపటాలు ఎగరవేస్తూ ఆనందోత్సవాలతో కేరింతలు కొడుతూ పండుగ జరుపుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్, జిల్లా మహిళా కో ఆర్డినేటర్ కాగితాల స్వాతి, సంఘం నాయకులు అన్నం నాగబాబు, వుడత శ్రీనివాసరావు, వాకా మాధవరావు, ఆలా శివాజీ, పారేపల్లి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.



గాలిపటాలు ఎగురవేస్తున్న చిన్నారులు

వాల్తేరు వీరయ్యకు విశేష ఆదరణ

దర్శకుడు కొల్లి బాబీ

తాడేపల్లి రూరల్: సంక్రాంతి పండుగ సందర్భంగా విడుదలైన చిరంజీవి నటించిన చిత్రం వాల్తేరు వీరయ్య సినిమా ఘన విజయం సాధించడంతో దర్శకుడు కొల్లి బాబీ ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలిపారు. సోమవారం దర్శకుడు గుంటూరు నుంచి విజయవాడ వెళ్తుండగా కాజ టోల్‌గేటు వద్ద చిరంజీవి యువత రాష్ట్ర ఉపాధ్యక్షులు కంకణాల శంకర్ ఆయన్ను కలిసి బాబీని సత్కరించారు. కొల్లి బాబీ మాట్లాడుతూ వాల్తేరు వీరయ్య సినిమాలో నటించిన చిరంజీవి, రవితేజ రికార్డులు బద్దలు కొట్టారని, వారిద్దరూ కాంబినేషన్‌లో సినిమా చాలా బాగా వచ్చిందని, ప్రేక్షకులు వారిద్దరినీ ఆదరించి మంచి కలెక్షన్లు ఇస్తున్నారని, ప్రేక్షక దేవుళ్లకు మా యూనిట్ తరపున ప్రత్యేక ధన్యవాదాలు చెప్పారు.



దర్శకుడు కొల్లి బాబీని సత్కరిస్తున్న చిరంజీవి యువత రాష్ట్ర ఉపాధ్యక్షులు కంకణాల శంకర్

టీటీడీ ఆలయంలో వసతుల కల్పనకు కృషి



టీటీడీ ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం వైఎస్సార్ సీపీ నాయకులతో ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్

ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ డొక్కా మాణిక్య వరప్రసాద్

వెంకటపాలెం(తాడికొండ): నానాటికీ పెరుగుతున్న భక్తుల ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకొని వెంకటపాలెం టీటీడీ ఆలయంలో వసతుల కల్పనకు టీటీడీతో మాట్లాడి కృషి చేస్తానని ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్, గుంటూరు జిల్లా పార్టీ అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్ అన్నారు. సోమవారం తుళ్లూరు మండలం వెంకటపాలెంలోని టీటీడీ ఆలయాన్ని సందర్శించిన ఆయన పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో కలసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వెంకటపాలెం తిరుమల తిరుపతి దేవస్థానానికి గుంటూరు, కృష్ణా జిల్లాల నుంచి భక్తుల తాకిడి పెరుగుతుందన్నారు. పండుగల నేపథ్యంలో భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకోవడం ఇందుకు నిదర్శనమన్నారు. పెరుగుతున్న రద్దీకి తగినట్లుగా మరిన్ని సౌకర్యాలు కల్పిస్తే భక్తులు ఇంకా పెరిగే అవకాశం ఉందని ఈ మేరకు టీటీడీ వారితో మాట్లాడి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఆయనకు తుళ్ళూరు మండలానికి చెందిన పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు స్వాగతం పలికి సంక్రాంతి, భోగి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

రావుల శివారెడ్డికి ఘన నివాళి

తాడేపల్లి రూరల్: దివంగత సీపీఐ నాయకుడు రావుల శివారెడ్డి 2వ వర్ధంతి సభను మంగళగిరి పట్టణ పరిధిలోని వేములపల్లి శ్రీకృష్ణ భవనంలో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల కార్యదర్శి జాలాది జాన్‌బాబు అధ్యక్షత వహించారు., రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ రావుల శివారెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, సహాయ కార్యదర్శి యార్లగడ్డ వెంకటేశ్వరరావు, కంచర్ల కాశయ్య, కాబోతు ఈశ్వరరావు, జవ్వాది సాంబశివరావు, సాంబిరెడ్డి, దారి మరియదాసు, తాడేపల్లి సహాయ కార్యదర్శి తుడిమెళ్ల వెంటక రామయ్య, ఏఐటీయూసీ నాయకులు చిన్ని సత్యనారాయణ, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పిల్లల మర్రి నాగేశ్వరరావు, బత్తూరి మోహన్‌రావు పాల్గొన్నారు.

తాడేపల్లి రూరల్: మానికొండ ముత్యాలరావు వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం తాడేపల్లి సీపీఐ కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమానికి తాడేపల్లి ప్రాంత సహాయ కార్యదర్శి తుడిమెల్ల వెంకటయ్య అధ్యక్షత వహించారు. తొలుత ముత్యాలరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం తాడేపల్లి ప్రాంత కార్యదర్శి కంచర్ల కాశయ్య, సీనియర్ నాయకులు కర్రి వెంకటేశ్వరరావు మాట్లాడారు. కార్యక్రమంలో మానికొండ డాంగే, మానికొండ భాస్కర్, మునగాల రామారావు, కర్రి సురేష్, గుద్దంటి శివ, గుంటక సాంబిరెడ్డి, షేక్ బాషా, హనోక్, శీలం శ్యామ్, శీలం లక్ష్మణ్, ఎం.వెంకటేశ్వరరావు, ప్రసాద్, ప్రశాంత్ రాజు, ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.



రావుల శివారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

పండుగ పూట దేవాలయాల్లో చోరీ

తాడేపల్లి రూరల్: కార్పొరేషన్ పరిధిలోని పెనుమాకలో పండుగ రోజున రెండు దేవాలయాల్లో చోరీ ఘటనలు చోటుచేసుకున్నాయి. సోమవారం తెల్లవారుజామున పెనుమాక వందేమాతరం హైస్కూల్ సెంటర్‌లోని బ్రహ్మంగారి గుడి, అదే గ్రామానికి చెందిన మెడికల్ షాప్ వద్ద గల రాములవారి దేవస్థానంలో హుండీలను దొంగలు ధ్వంసం చేశారు. రామాలయం దేవస్థానం వద్ద ఉన్న హుండీని వెల్డింగ్‌లు తొలగించి అక్కడి నుంచి తీసుకుని వెళ్లిపోయారు. బ్రహ్మంగారి గుడిలో హుండీని బయటకు తీసుకు వచ్చి దానిలో ఉన్న డబ్బులు దొంగిలించి పారిపోయినట్లు ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. రామాలయం వద్ద సీసీ కెమెరాల్లో దొంగతానికి పాల్పడ్డ వ్యక్తి గతంలో తుళ్లూరు మండలం మందడం గ్రామంలోని సాయిబాబాబా గుడిలో దొంగతనం చేసిన వ్యక్తిగా రామాలయ దేవస్థాన చైర్మన్ మన్నం అప్పాజీ అనుమానం వ్యక్తం చేస్తున్నారు. జరిగిన ఈ ఘటనపై దేవాలయం వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాడేపల్లి ఎస్‌ఐ నారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

శివాలయం హుండీల లెక్కింపు రేపు

తాడేపల్లి రూరల్: మంగళగిరి పట్టణ పరిధిలోని శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానం ముఖ మండపంపై ఈనెల 18వ తేదీన ఉదయం 9 గంటలకు స్వామి వార్లకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను లెక్కించనున్నట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి అన్నపురెడ్డి రామకోటిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న భక్తులు హుండీ లెక్కింపు కార్యక్రమంలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

పలువురికి సన్మానం

తెనాలి అర్బన్: నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాలలో భాగంగా ఆదివారం రాత్రి కీబోర్డు కళాకారుడు పుట్టా శివను కొత్తపేటలోని పెన్షనర్స్ అసోసియేషన్ హాల్‌లో ఘనంగా సన్మానించారు. అనంతరం ఎన్టీఆర్ వ్యక్తిత్వంపై కేఎస్ఎస్ శర్మ, కపిలవాయి శ్రీనివాసరావులు ప్రసంగించారు. వారిని సన్మానించారు. ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవ కమిటీ సభ్యులు వెంపటి సత్యనారాయణ, దేవరపల్లి భవాని, ఎన్టీఆర్ జగన్, ముప్పనేని రాఘవరావు, కంచర్ల ఏడుకొండలు, కంచర్ల నాగభూషణం, దేవిశెట్టి భాస్కర్, పిటీ అవధాని, వెనిగళ్ల శివప్రసాద్, బడుగు మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగి ఇంట్లో చోరీ

తాడేపల్లి రూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని యర్రబాలెంలో నివాసముండే బీఎస్ఎన్ఎల్ విశ్రాంత ఉద్యోగి ఇంట్లో చోరీకి పాల్పడిన ఘటన చోటుచేసుకుంది. ఆ ఉద్యోగి గుర్తించి మంగళగిరి రూరల్ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. వివరాలు.. తాడేపల్లి సత్యసాయి ఉద్యోగ విరమణ అనంతరం యర్రబాలెం అంబటి నగర్, మసీదు వీధిలో ఇల్లు నిర్మించుకుని నివాసముంటున్నాడు. ఈనెల 13వ తేదీ హైదరాబాద్‌లో ఉంటున్న కుమార్తె ఇంటికి సత్యసాయి, ఆయన భార్య లలిత ఇద్దరూ వెళ్లారు. 16వ తేదీ ఉదయం హైదరాబాద్ నుంచి ఇంటికి వచ్చి చూడగా ప్రధాన ద్వారం తలుపులకు వేసిన తాళం పగులకొట్టి ఉండడాన్ని గమనించి మంగళగిరి రూరల్ పోలీసులు ఫిర్యాదు చేశాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ విజయ్‌కుమార్ రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. సత్యసాయి ఇంట్లో బీరువాలో 75 వేల రూపాయల నగదు ఉందని, ఒక బ్రాస్‌లెట్ ఉందని, ఒక చోట 25 వేల రూపాయలు, మరో చోట 50 వేలు ఉన్నట్లు వివరించారు. పోలీసులు క్లూస్ టీమ్‌కు పిలిపించి వేలిముద్రలు సేకరించారు. అనంతరం సత్యసాయి బీరువాలో తనిఖీ చేయగా కేవలం 25 వేల రూపాయలు పోయినట్లు గుర్తించారు. బ్రాస్‌లెట్, మరో 50 వేల రూపాయలు, కాటన్(దూది)లో ఉంచారు. ఆ కాటన్‌ను బయటకు తీసి మంచంమీద పడవేయడంతో బ్రాస్‌లెట్, 50వేల రూపాయలు నగదు ఉండడంతో పోలీసులు సత్యసాయి ఊపిరి పీల్చుకున్నారు. ఆ డబ్బులు, బ్రాస్‌లెట్ దూదిలో ఉంచడం వల్ల పోలేదని లేకపోతే అవి కూడా చోరీకి గురయ్యేవని సత్యసాయి వివరించారు. జరిగిన ఘటనపై మంగళగిరి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



ఇంట్లో చెల్లాచెదురుగా పడవేసిన వస్తువులు

వర్ధమాన నటీనటులను ప్రోత్సహించాలి

మా ఏపీ వ్యవస్థాపకుడు, సినీ దర్శకుడు దిలీప్‌రాజా

తెనాలి: వర్ధమాన నటీనటులను సినీ పరిశ్రమ ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని మా–ఏపీ వ్యవస్థాపకుడు, సినీ దర్శకుడు దిలీప్‌రాజా అన్నారు. స్థానిక గౌతమ్ గ్రాండ్‌లో సోమవారం విలేకర్ల సమావేశంలో 'జబర్దస్త్' నటీనటులు దుర్గారావు, అప్పారావు, హరితలను సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ జబర్దస్త్ స్కిట్‌లలో నటించే నటీనటులు అందరికీ తగిన సమయస్ఫూర్తి, టైమింగ్ ఉన్నందునే ప్రజాదరణ పొందుతున్నారని అభిప్రాయపడ్డారు. దుర్గారావుకు తన తాజా చిత్రంలో అవకాశం కల్పిస్తున్నట్టు ప్రకటించారు. హాస్యం అపహాస్యంగా బూతులతో నిండి ఉండటం సంప్రదాయం కాదన్నారు. ఓటీటీల్లో ప్రసారమవుతున్న వెబ్ సిరీస్, యూ ట్యూబ్ సోషల్ మీడియాలో అశ్లీలత కంటెంట్‌పై సెన్సార్ అవసరం ఉందని తాను భావిస్తున్నట్టు చెప్పారు. అరచేతిలో ఫోన్ ద్వారా పోర్న్ కంటెంట్ ప్రసారం కాకుండా చూడాలని కేంద్ర సమాచారం ప్రసార శాఖ మంత్రికి లిఖితపూర్వకంగా విజ్ఞప్తి చేసినట్టు చెప్పారు. వర్ధమాన నటులు మిలటరీ ప్రసాద్, భాను మున్నంగి, రాబర్ట్, జూలకంటి బాబ్జి, బేతపూడి నాగేంద్ర, చిన్నికృష్ణ పాల్గొన్నారు.



అప్పారావు, దుర్గారావు, హరితను సత్కరిస్తున్న దిలీప్‌రాజా

'ప్రేమతో నాన్న'కు బహుమతుల పంట

తెనాలి: కాకినాడ జిల్లా భోగాపురంలో భోగాపురం కళాపరిషత్ ఈ నెల 11, 12, 13 తేదీల్లో నిర్వహించిన ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి నాటికల పోటీల్లో శ్రీ సాయి ఆర్ట్స్ కొలకలూరు వారు ప్రదర్శించిన 'ప్రేమతో నాన్న' నాటిక పలు బహుమతులు కైవసం చేసుకుంది. ఉత్తమ ప్రదర్శన బహుమతితో పాటు ఉత్తమ నటనకుగాను మరో రెండు బహుమతులు లభించాయి. నాటికలో ప్రధాన పాత్ర పోషించి, దర్శకత్వం వహించిన గోపరాజు విజయ్ ఉత్తమ నటుడు, ఉత్తమ దర్శకత్వం బహుమతులను స్వీకరించారు. నాటికలో నటించిన సీవీఆర్ మూర్తి, ప్రభావతిలు ఉత్తమ నటన విభాగంలో బహుమతులను అందుకొన్నారు. విశాఖపట్టణం తెలుగు కళాసమితి నిర్వహించిన కథానాటికల పోటీల్లో ప్రథమ బహుమతిని ప్రేమతో నాన్న నాటికను శ్రీ సాయి ఆర్ట్స్, కొలకలూరు గెలుచుకుంది. నంద్యాలలో ఇదే నెలలో జరిగిన అజో విభో కందాళం ఫౌండేషన్ కథానాటికల పోటీల్లో ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా నిలిచింది. మళ్లీ ఇప్పుడు ఉత్తమ ప్రదర్శనతో పాటు మొత్తం ఐదు బహుమతులను గెల్చుకోవటం విశేషం. మూల కథను రావి నాగేశ్వరరావు నాటకీకరించారు అత్తింటిలో సమస్యలు ఎదురైతే పరిష్కారం కోసం ప్రతిసారీ అమ్మనాన్నలకేసి చూడకుండా, తగిన నిర్ణయం, బాధ్యత మహిళే తీసుకునేలా కూతురికి హిత బోధ చేస్తాడు తండ్రి. జీవితంలో జయాపజయాలను ఎదుర్కొనే కుమార్తెలు సాధించే విజయాలకు ప్రేరణే ప్రేమతో నాన్న నాటిక అని దర్శకుడు గోపరాజు విజయ్ తెలిపారు.



ప్రేమతో నాన్న నాటికలో ఓ సన్నివేశం

విద్యార్థులకు నగదు పంపిణీ

తెనాలి అర్బన్: ఈదర విజయలక్ష్మి 19వ వర్ధంతిని పురస్కరించుకుని తెనాలి మండల పరిధిలోని జిల్లా పరిషత్ స్కూల్స్‌లో ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించిన విద్యార్థులు కొల్లా శ్రీనివాసు, సీహెచ్ శివనాగరాజు, యార్లగడ్డ మధులత, రంగం నాగతేజస్వీ, బిట్రా యజ్ఞనాగవరప్రసాద్, ఎస్.మణికంఠ రాఘవేంద్ర, బిట్రా సుశ్రియలకు ఆమె కుటుంబ సభ్యులు అభినందించి, సన్మానించారు. అలాగే ఒక్కొక్కరికి రూ.రెండు వేల చొప్పున నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. నందులపేటలోని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వేజళ్ల ఉమామహేశ్వర్ నివాసంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఈదర వెంకట్రావు, గరికపాటి సుబ్బారావు, యార్లగడ్డ శైలజ, వాసుదేవ నాయుడు, వేమూరి విజయభాస్కర్, అయినాల మల్లేశ్వరరావు, డాక్టర్ వేమూరి శేషగిరిరావు, పలువురు హెచ్ఎంలు పాల్గొన్నారు.



నగదు అందుకున్న విద్యార్థులతో ఉమామహేశ్వర్, వెంకట్రావు తదితరులు

వాహనం అదుపు తప్పి వ్యక్తి మృతి

తెనాలి రూరల్: వాహనం అదుపు తప్పి కింద పడడంతో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన ఆదివారం పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణ చెంచుపేటకు చెందిన జంధ్రాజుపల్లి సుబ్బయ్య(44) గుంటూరు మిర్చి యార్డులో కూలీ పనులకు వెళుతుంటాడు. ఆదివారం సాయంత్రం ద్విచక్రవాహనంపై చెంచుపేట నుంచి సుల్తానాబాద్ వైపు వెళుతుండగా, ఆర్‌సీఎం చర్చి కూడలి వద్ద స్పీడ్ బ్రేకర్‌ను గమనించకపోవడంతో వాహనం అదుపుతప్పింది. సుబ్బయ్య కిందపడగా తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న త్రీ టౌన్ పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. కుటుంబసభ్యులకు సమాచారం అందించి మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

19న మోదుకూరులో వేమన జయంతి ఉత్సవాలు

తెనాలి రూరల్: బాపట్ల జిల్లా చుండూరు మండలంలోని మోదుకూరు గ్రామంలోని వేమన జయంతి ఉత్సవ కమిటీ, ఆంధ్రా లయోలా కాలేజీ విజయవాడ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 19న మహాకవి వేమన జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు. మోదుకూరులలోని వేమన సాహిత్య భవనంలో ఆ రోజు ఉదయం గుంటూరు, బాపట్ల జిల్లాల విద్యార్థులకు వేమన పద్య పఠన పోటీలను నిర్వహించనున్నారు. మధ్యాహ్నం జయంతి సభకు ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అధ్యక్షత వహిస్తారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ కులపతి ఆచార్య పి.రాజశేఖర్, అధికార భాషా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.విజయ్‌బాబు, ప్రభుత్వ సహకార వాణిజ్య శాఖ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి, ఇతర ప్రముఖులు పాల్గొంటారని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఇదే సభలో వేమన పద్యపఠన పోటీ విజేతలకు బహుతులను ప్రదానం చేస్తారని వివరించారు.

ముగిసిన ధనుర్మాస వ్రతమహోత్సవాలు

తెనాలిటౌన్: గంగానమ్మపేటలోని విద్యాపీఠంలో పూజ్యశ్రీ బాలస్వామీజీ పర్యవేక్షణలో జరుగుతున్న ధనుర్మాస వ్రత మహోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా ప్రతినిత్యం మేలుకొలుపు, గోదారంగనాథులకు సాలిగ్రామాన అభిషేకాలు జరిపారు. బాలస్వామీజీ విశేషంగా పూజలు జరిపారు. భక్తులచే గోదారంగనాథులకు అష్టోత్తర శతనామార్చన, ఆరగింపు, తిరుప్పావై గోష్ఠి నిర్వహించారు. ఉభయదాతలు రావూరి సుబ్బారావు, ఉషారాణి దంపతులు, మువ్వల రామసుబ్బారావు, వెంకటసుశీల దంపతులు పూజలు జరిపారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. విద్యాపీఠం సభ్యులు పాల్గొన్నారు.